క్లుప్తంగా

మృతదేహం లభ్యం

సఖినేటిపల్లి: స్థానిక బోను సెంటర్‌కు సమీపంలో గోదావరి నది ఒడ్డుకు గుర్తు తెలియని పురుషుడి మృతదేహం కొట్టుకువచ్చినట్టు ఎస్సై హరికోటి శాస్త్రి శుక్రవారం తెలిపారు. మృతుడి వయసు సుమారు 40 నుంచి 50 ఏళ్ల మధ్య ఉండవచ్చునని, ఒంటిపై దుస్తులు లేవని, మృతదేహం పొడవు 5.8 అడుగులు ఉంటుందని తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



రామకృష్ణ (ఫైల్)

కంబాలచెరువు: స్థానిక జాంపేట సిరి డైరీ వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని శుక్రవారం స్థానికులు గుర్తించారు. వారి సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న మూడో పట్టణ పోలీసులు మృతదేహాన్ని పరిశీలించగా ఎటువంటి ఆధారం లభించలేదు. మృతుని చేయిపై శంకర్ అని పచ్చబొట్టు ఉంది. ఆచూకీ తెలిసిన వారు మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రి మార్చురీలో భద్రపరిచారు.

వ్యాన్ ఢీ కొని..



రామకృష్ణ (ఫైల్)

రాజానగరం: స్థానిక పాత ఎన్‌హెచ్‌పై టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ సమీపంలో శుక్రవారం జరిగిన ప్రమాదంలో చక్రద్వారబంధానికి చెందిన పితాని రామకృష్ణ (52) మృతి చెందారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు చక్రద్వారబంధం నుంచి బైకుపై రాజానగరం వచ్చి తిరిగి వెళ్తుండగా రోడ్డు పై పడిన గుంతను తప్పించే క్రమంలో ప్రమాదవశాత్తు పక్క నుంచి వెళ్తున్న వ్యాన్ కింద పడడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమారుడికి ఇటీవలే వివాహం చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అనారోగ్యంతో ఎంపీటీసీ అభ్యర్థి ..



దివ్య (ఫైల్)

దేవరపల్లి: మండలంలోని జనసేన పార్టీ ఎంపీటీసీ అభ్యర్థి గారపాటి దివ్య (23) అనారోగ్యంతో రాజమహేంద్రవరం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం గారపాటి దివ్య జనసేన పార్టీ ఎంపీటీసీ అభ్యర్థిగా పోటీ చేసింది. గురువారం పోలింగ్ అనంతరం మధ్యాహ్నం ఆమె అస్వస్థతకు గురికావడంతో చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం రాత్రి ఇంటికి తీసుకువచ్చారు. శుక్రవారం ఉదయం ఆమె అనారోగ్యానికి గురికాగా, చికిత్స కోసం మళ్లీ రాజమహేంద్రవరం ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. దివ్యకు నాలుగు నెలల క్రితం బాబు పుట్టగా, అంతకు ముందు ఒక కుమారుడు ఉన్నాడు. ఆమె మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

అపార్ట్‌మెంట్‌లో చోరీ

- తాళాలు పగలగొట్టి ఆభరణాల అపహరణ
- సొత్తు విలువ రూ.15 లక్షలు

కపిలేశ్వరపురం (మండపేట): పట్టణంలో గుర్తు తెలియని వ్యక్తి అపార్ట్‌మెంట్ గది తాళాలు పగలగొట్టి చోరీకి పాల్పడ్డాడు. ఊరి నుంచి తిరిగి వచ్చిన ఫ్లాట్ యజమాని ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసుల కథనం ప్రకారం... పట్టణ పరిధిలోని విజయలక్ష్మి నగర్‌లో బిస్మిల్లా అపార్ట్‌మెంట్‌లోని పుట్టా ప్రసాద్ చౌదరి ఈ నెల రెండో తేదీన తిరుపతి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో ఉండగా అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్ ఫోన్ చేసి ఫ్లాట్ తలుపులు తీసి ఉన్నాయని సమాచారం ఇచ్చాడు. శుక్రవారం వచ్చి చూడగా ఫ్లాట్ తాళాలు, దేవుని గది, బెడ్ రూమ్ తాళాలు పగలగొట్టి ఉన్నాయి. 120 గ్రాముల బంగారం, 750 గ్రాముల వెండి ఆభరణాలు, 2.5 లక్షల నగదు, హెచ్‌డీఎఫ్‌సీ లాకర్ కీ, స్మార్ట్ వాచ్ చోరీకి గురయ్యాయి. మొత్తం చోరీ సొత్తు రూ.15 లక్షలు ఉంటుందని బాధితుడు పుట్టా ప్రసాద్ తెలిపారు. క్రైమ్ బ్రాంచి డీఎస్పీ పట్నాయక్ పర్యవేక్షణలో, పట్టణ సీఐ వాసంశెట్టి శ్రీనివాస్ ఆధ్వర్యంలో క్లూస్ టీం ఆధారాలు సేకరించే ప్రయత్నం చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ శ్రీనివాస్ తెలిపారు.



చాగల్లు: కొవ్వూరు మండలం కాపవరం జగనన్న కాలనీలో వరద నీరు



చాగల్లు: ముంపునకు గురైన కొవ్వూరు మండలం కాపవరం జంక్షన్ నుండి తాళ్లపూడి వెళ్లే రహదారి



చాగల్లు: చాగల్లు- కాపవరం రోడ్డులో వంతెన పై నుంచి ప్రవహిస్తున్న వరద



చాగల్లు: నదిని తలపిస్తూ నీటమునిగిన వరిచేలు



చాగల్లు: ఊనగట్ల- చాగల్లు రైల్వేస్టేషన్ రహదారిలో ఉధృతంగా సాగుతున్న ప్రవాహం

కొవ్వాడలో ముంపు

- కొవ్వూరు, చాగల్లు మండలాల్లో జలదిగ్బంధం
- నీట మునిగిన వేలాది ఎకరాల పంట పొలాలు..
- వరద నీటిలో కాలనీలు..
- నిలిచిన రాకపోకలు
- చేతికొచ్చిన పంట నీటిపాలు..
- కన్నీరు మున్నీరవుతున్న అన్నదాతలు

చాగల్లు: వరుస తుపాన్లు, ఎడతెరిపి లేని వర్షాలకు తోడు ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద నీటితో కొవ్వాడ కాలువ ఉగ్రరూపం దాల్చింది. దీంతో కొవ్వూరు, చాగల్లు మండలాల్లోని పలు గ్రామాలు జల దిగ్బంధంలో చిక్కుకున్నాయి. వేలాది ఎకరాల పొలాలు నీట మునగగా, లోతట్టు కాలనీలు ముంపునకు గురయ్యాయి. రహదారులు, వంతెనలపై ప్రమాదకర స్థాయిలో నీరు ప్రవహించడంతో అధికారులు రాకపోకలను నిలిపివేశారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

జలదిగ్బంధంలో రహదారులు

కొవ్వూరు, చాగల్లు మండలాల్లోని ప్రధాన రహదారులపై కొవ్వాడ వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో అధికారులు రాకపోకలను నిలిపివేశారు. కాపవరం–ధర్మవరం రహదారి, చాగల్లు నుంచి నందమూరు మీదుగా కొవ్వూరు వెళ్లే మార్గం, చాగల్లు నుంచి పసివేదల మీదుగా కొవ్వూరు వెళ్లే మార్గం, చాగల్లు–కాపవరం రహదారిపై రాకపోకలు నిలిచిపోయాయి. అలాగే చాగల్లు–మార్కొండపాడు మార్గం, ఊనగట్ల–చాగల్లు రైల్వే స్టేషన్ రహదారి, దారవరం రైల్వే గేట్ నుంచి వెళ్లే మార్గాల్లోనూ వరద ఉధృతి అధికంగా ఉండడంతో అధికారులు రాకపోకలను నిలిపివేశారు.

పునరావాస కేంద్రాల ఏర్పాటు..

ముంపు ప్రాంతాల్లో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అధికారులు పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వరద నీరు ప్రవహిస్తున్న రహదారులు, వంతెనలపై నుంచి ప్రయాణించవద్దని సూచిస్తున్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి వరద బాధితులకు అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని, పంట నష్టాన్ని అంచనా వేసి రైతులకు తగిన పరిహారం అందించాలని బాధితులు కోరుతున్నారు.



దేవరపల్లి: గోపాలపురం మండలం కరిచర్లగూడెం రహదారికి గండి పడి పొంగుతున్న వరదనీరు



నిడదవోలు రూరల్: తాళ్లపాలెంలో నడుము లోతు నీటిలో గ్రామస్తుల అవస్థలు



నిడదవోలు రూరల్: తిమ్మరాజుపాలెంలో ముంపు నీటిలో చిక్కుకున్న కాలనీలు

జగనన్న కాలనీ మునక

కొవ్వాడ నీటి ఉధృతికి కొవ్వూరు మండలం కాపవరంలోని జగనన్న కాలనీ నీట మునిగి, విద్యుత్ సరఫరా నిలిచిపోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే చాగల్లు మండలం బ్రాహ్మణగూడెంలో శుక్రవారం వీధులు జలమయమయ్యాయి. 40 ఏళ్ల క్రితం వచ్చిన వరదను స్థానికులు గుర్తుచేసుకుంటున్నారు.



చాగల్లు: కొవ్వూరు మండలంలో జాతీయ రహదారి సర్వీస్ రోడ్డు వంతెనను తాకుతూ ప్రవహిస్తున్న కొవ్వాడ కాలువ

కనుచూపు మేరంతా నీరే..

వరుస తుపానులు, వర్షాలు, ఈదురుగాలులతో చేతికొచ్చిన పంపలు నేలకు ఒరిగి పోయాయి. ఈ పరిస్థితుల్లో ఎగువ ప్రాంతాల నుంచి కొవ్వాడ కాలువకు వస్తున్న వరద నీటితో పరిస్థితి మరింత దయనీయంగా మారింది. కొవ్వూరు మండలంలోని కాపవరం, పసివేదల, వేములూరు, నందమూరు గ్రామాలతో పాటు చాగల్లు మండలంలోని చాగల్లు, నెలటూరు, గౌరిపల్లి మార్కొండపాడు, చంద్రవరం, మల్లవరం, దారవరం, నందిగంపాడు తదితర గ్రామాల్లో పంటలు మునిగిపోగా, అరటి, ఉద్యాన పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి.

గల్లంతైన విజయకుమార్ ఎక్కడ?

- అతని ఆచూకీ కోసం కుటుంబ సభ్యుల ఆందోళన
- చెట్టు కొమ్మ ఆసరాగా ప్రాణాలు దక్కించుకున్న మహిళ
- పట్టించుకోని పోలీసులు, అధికారులు

దేవరపల్లి: గోపాలపురం మండలం చిట్యాల సమీపంలోని కొవ్వాడ కాలువలో గల్లంతైన బ్యాంకు అప్రైజర్ విజయకుమార్ ఆచూకీ ఇంత వరకు లభించలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. అతడితో పాటు బైక్‌పై వెళ్తున్న మహిళ పద్మ సురక్షితంగా ప్రమాదం నుంచి బయటపడ్డారు. ప్రస్తుతం ఆమె చిట్యాలలోని మాజీ సర్పంచ్, వైఎస్సార్ సీపీ నాయకుడు పీతల ప్రసాద్ బాబు ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు కర్నూలుకు చెందిన పద్మ పది రోజుల క్రితం తాళ్లపూడి మండలం అన్నదేవరపేటలో ని తన బంధువుల ఇంటికి వచ్చింది. గురువారం రాత్రి కర్నూలుకు వెళ్లడానికి బస్సు టికెట్ బుక్ చేసుకుంది. అయితే ఆమెను దిగబెట్టాలనుకున్న బంధువులు అత్యవసర పనిపై వేరే ప్రాంతానికి వెళ్లడంతో పక్కనే ఉన్న బ్యాంక్ ఆఫ్ బరోడాలో అప్రైజర్‌గా పనిచేస్తున్న విజయకుమార్‌కు పద్మను దేవరపల్లి తీసుకువెళ్లి బస్సు ఎక్కించాలని పురమాయించారు. సాయంత్రం 5.30 గంటల సమయంలో అతడు పద్మను బైక్‌పై ఎక్కించుకుని దేవరపల్లి బయలు దేరారు. 6.45 గంటల సమయంలో వీరు చిట్యాల–అన్నదేవరపేట మధ్య రోడ్డుపై ప్రవహిస్తున్న వరద నీటిలో వెళ్తుండగా ఎదురుగా వస్తున్న లారీ లైట్ల వల్ల దారి కనపడక కొద్దిగా పక్కకు వెళ్లడంతో బండి అదుపుతప్పి కొవ్వాడ కాలువలో పడిపోయి కొట్టుకుపోయారు. కాలువ గట్టున ఉన్న చెట్టుకొమ్మలను పట్టుకుని పద్మ తనను రక్షించాలని కేకలు వేయడంతో అడుగా వెళ్తున్న వారు ఆమెను రక్షించారు. కాగా విజయకుమార్ బైక్‌తో పాటు కాలువలో కొట్టుకుపోయాడు. చిట్యాలకు చెందిన పీతల ప్రసాద్ బాబు, మరి కొందరు ఘటనా స్థలానికి చేరుకుని అప స్మారక స్థితిలో ఉన్న పద్మను ఇంటికి తీసుకువెళ్లి వైద్యం చేయించారు. ప్రమాద సంఘటనపై ప్రసాద్ బాబు ఎన్‌డీఆర్ఎఫ్ బృందానికి సమాచారం ఇవ్వగా, వారు రాత్రి వచ్చి కాలువలో గాలించారు. అయితే ఈ ప్రాంతం చీకటిగా ఉండడంతో ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది వెళ్లిపోయారు. శుక్రవారం సాయంత్రం వరకు విజయకుమార్ ఆచూకీ తెలియకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు.



విజయకుమార్ గల్లంతైన ప్రదేశం



పద్మ ప్రాణాలు కాపాడిన చెట్టు కొమ్మలు



ప్రమాదం నుంచి బయటపడిన పద్మ

జాడలేని పోలీసులు, ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు

విజయ్‌కుమార్ గల్లంతైన ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయగా సిబ్బంది అందరూ ఎన్నికల విధుల్లో ఉన్నారని చెప్పినట్టు స్థానికులు చెప్తున్నారు. ఘటన గురువారం రాత్రి జరగ్గా శుక్రవారం సైతం ఎవరూ స్పందించకపోవడం శోచనీయం. కాగా వైఎస్సార్ సీపీ నేత ప్రసాద్ బాబు సమాచారంతో గురువారం రాత్రి వచ్చిన ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు ఘటనా స్థలం చీకటిగా ఉన్నందున చేసేది లేక వెళ్లిపోయారు. కాగా శుక్రవారం ఫోన్ పదే పదే ఫోన్ చేస్తున్నా ఎవరూ స్పందించడం లేదని స్థానికులు తెలిపారు.

ఎలక్ట్రిక్ బైక్ పేలి మంటలు

- రావులపాలెం అపార్ట్‌మెంట్ సెల్లార్‌లో ఛార్జింగ్ సమయంలో అగ్నిప్రమాదం
- కారు, రెండు బైక్‌ల దగ్ధం

రావులపాలెం: స్థానిక సీఆర్‌సీ రోడ్డులోని లక్ష్మీనివాస్ అపార్ట్‌మెంట్ సెల్లార్‌లో శుక్రవారం రాత్రి ఘోర ప్రమాదం తప్పింది. అక్కడ ఛార్జింగ్ పెట్టిన ఎలక్ట్రిక్ బైక్ పేలి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. మంటలు వేగంగా పక్కనే పార్కింగ్ చేసి ఉన్న కారు, బుల్లెట్‌కు వ్యాపించడంతో ఆ మూడు వాహనాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. అగ్నిప్రమాదాన్ని గమనించిన అపార్ట్‌మెంట్ వాసులు, స్థానికులు మంటలను ఆర్పేందుకు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోయింది. కొత్తపేట అగ్నిమాపక కేంద్రం సిబ్బంది ఫైర్ ఇంజిన్‌తో ఘటనా స్థలానికి చేరుకుని తీవ్రంగా శ్రమించి మంటలను అదుపు చేశారు. ఎలక్ట్రిక్ బైక్ ఛార్జింగ్ పెట్టిన సమయంలో జరిగిన ఈ ప్రమాదంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు.



రావులపాలెం అపార్ట్‌మెంట్ సెల్లార్‌లో దగ్ధమవుతున్న వాహనాలు

అంతర్జాతీయ రోబోటిక్స్‌లో ఆదిత్య ప్రతిభ



విజేతలను అభినందిస్తున్న ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ శేషారెడ్డి

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఇండోనేషియా టాంగెరాంగ్, లిప్పోలో ఉన్న యూపీహెచ్ యూనివర్సిటీ రోబోరోజ్-26 అంతర్జాతీయ రోబోటిక్స్ పోటీల్లో ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. దేశం నుంచి ప్రాతినిధ్యం వహించిన విద్యార్థుల బృందం పైలట్ విభాగంలో ప్రథమ స్థానం సాధించారు. అడ్డగళ్ల తులసి, దొడ్డి దత్త శ్రీకరి, జనపాల వైష్ణవీ రావు, గాజువాక బ్రాంచ్ విద్యార్థులు ఘరాబిడి సతీష్, మహ్మద్ ఫైజాన్ ఈ పోటీల్లో ప్రతిభ చాటారు. శుక్రవారం ఆ విద్యాసంస్థల చైర్మన్ శేషారెడ్డి, కళాశాల కార్యదర్శి సుగుణారెడ్డి, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బీఇ వీఎల్ నాయుడు, ప్రిన్సిపాల్ బ్యులా, మహిళ కళాశాల ప్రిన్సిపాల్ కరుణ వారిని అభినందించారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి రకం	ధర (రూ.)
కొత్త కొబ్బరి (క్వింటాల్)	16,000 – 17,000
కొత్త కొబ్బరి (రెండో రకం)	15,000 – 16,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	23,500
గటగట (వెయ్యి)	21,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	22,500
గటగట (వెయ్యి)	20,000

బ్యాంక్ ఆఫ్ బరోడా Bank of Baroda ROSARB - రాజమండ్రి

సవరణ

తేది.05-11-2026న సాక్షి దినపత్రిక, కోనసీమ జిల్లాలో ప్రచురించబడిన మెనర్స్ (శ్రీదేవి హేచరీ యొక్క స్థిరాస్తుల విక్రయం కొరకు అమ్మకం నోటీసులో ఈ-వేలం **తేదీ.20.11.2026 తప్పుగా** ప్రచురితమైనది. దయచేసి ఈ-వేలం **తేదీని 24.11.2026 గా చదువుకోగలరు.** మిగతా వివరములలో ఏ మార్పు లేదు. గమనించగలరు.

సం/- చీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి బ్యాంక్ ఆఫ్ బరోడా, రాజమండ్రి


10న 'యూత్ గేమ్స్' రాష్ట్ర జట్ల ఎంపిక

మొగల్రాజపురం (విజయవాడ తూర్పు): డిసెంబర్ 11 నుంచి 22వ తేదీ వరకు హైదరాబాద్‌లో జరగనున్న ఏడవ ఖేలో ఇండియా యూత్ గేమ్స్ – 2026లో ఆంధ్రప్రదేశ్ తరపున ప్రాతినిధ్యం వహించేందుకు అండర్–18 రాష్ట్ర క్రీడాకారుల ఎంపికలను ఈ నెల పదో తేదీన నిర్వహిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) ప్రతినిధులు ఓ ప్రకటనలో తెలిపారు. వివిధ క్రీడాంశాలకు వేర్వేరు ప్రాంతాలలో ఎంపికలు నిర్వహిస్తున్నామన్నారు. గుంటూరులోని బీఆర్ స్టేడియంలో బాలురు కబడ్డీ జట్టు, కాకినాడలోని శాప్ జిల్లా కార్యాలయం ఆవరణలో ఖోఖో బాలురు, పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలోని ఎస్‌సీహెచ్‌ఆర్‌ఎం హైస్కూల్ ఆవరణలో బాల బాలికలకు మల్కంబ్ ఎంపికలు జరుగుతాయని వివరించారు. పదో తేదీ ఉదయం 9 గంటల నుంచి ఎంపికలు జరుగుతాయని తెలిపారు. జనవరి ఒకటో తేదీ 2009 తేదీ తర్వాత జన్మించిన క్రీడాకారులు మాత్రమే ఈ ఎంపికలకు అర్హులని పేర్కొన్నారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు పదో తరగతి మార్కుల సరిఫికెట్, పాస్‌పోర్ట్, ఆధార్ కార్డ్, జనన ధ్రువీకరణ పత్రం (వీటిలో ఏదైనా ఒకటి) తప్పనిసరిగా వెంట తీసుకురావాలని తెలిపారు. వివరాలకు 99082 67811లో సంప్రదించాల్సిందిగా కోరారు.

మూగజీవిని రక్షించబోయి పాడి రైతు మృతి

- తాడు బంధం ఉండడంతో ప్రాణాలు కోల్పోయిన గేదె
- మేత మేస్తూ చెరువులో దిగబడి ఊపిరాడక మృతి

కోరుకొండ: పల్లెల్లో పశువుల పెంపకంతో పాటు, వాటి పట్ల బంధం కూడా పెనవేసుకుని ఉంటుందనడానికి ఈ ఘటనే నిదర్శనం. మండలం కోటి గ్రామంలోని ముత్తయ్య చెరువులోకి దిగిన గేదెను కాపాడబోయి పాడిరైతు బండెల పోసేశ్వరరావు (53)మృతి చెందాడు. స్థానిక ఎస్సై ఆర్.శివాజీ తెలిపిన వివరాల మేరకు మెడకు, కాలికి తాడుతో బంధం వేసి ఉన్న గేదె మేతకు వెళ్లింది. మేత మేస్తూ స్థాని ముత్తయ్య చెరువులోకి దిగింది. అయితే తాడు ఉందన్న విషయాన్ని గుర్తించలేని పాడిగేదె చెరువులో దిగబడిపోయింది. దానికి ఉన్న తాడును తప్పించే క్రమంలో పోసేశ్వరరావు చెరువులో చిక్కుకుని ఊపిరాడక మృతి చెందాడు. అనంతరం పాడి గేదె సైతం మృతి చెందింది. ఈ పాడిగేదె ఖరీదు రూ.1 లక్ష ఉంటుందని యజమానులు తెలిపారు. పోసేశ్వరరావుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. అతడి మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. ఎస్సై ఆర్. శివాజీ సంఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మెడకు, కాలికి తాడు కట్టి ఉండడంతో చెరువులో మృతి చెందిన పాడి గేదె



కోటి గ్రామంలో మృతి చెందిన పోసేశ్వరరావు

నేటి నుంచి పాపికొండల పర్యాటకం



గోదావరిలో పాపికొండలకు వెళ్తున్న లాంచీ

దేవీపట్నం: గోదావరి నదిలో బోట్ ప్రయాణం చేస్తూ పాపికొండల అందాలను వీక్షించే విహార యాత్ర నేటి నుంచి పునఃప్రారంభం కానుంది. పది రోజుల క్రితం ఏర్పడిన ఆర్నబ్, మురసు తుపాన్ల నేపథ్యంలో ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఈ పాపికొండల విహార యాత్ర నిలిపివేశారు. గోదావరిపై విహారానికి పరిస్థితులు అనుకూలంగా ఉండడంతో అధికారులు మళ్లీ అనుమతులు ఇచ్చారు.

పెట్రోల్ పోసుకుని యువకుడి హల్‌చల్

చీపురుపల్లి రూరల్ (గరివిడి): ఒంటిపై పెట్రోల్ పోసుకుంటూ ఓ యువకుడు విజయనగరం జిల్లా గరివిడి పోలీస్‌స్టేషన్ ఎదురుగా శుక్రవారం ఉదయం హల్‌చల్ చేశాడు. వివరాల్లోకి వెళ్తే.. కాకినాడలోని జగన్నాథపురానికి చెందిన ఎండీ గౌస్ అదే ప్రాంతానికి చెందిన అమ్మాయిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. అయితే, ఈ యువకుడి ప్రవర్తనతో విసిగిపోయిన భార్య తన ఏడేళ్ల పాప, తల్లిదండ్రులతో కలిసి కొద్ది రోజుల కిందట గరివిడి సమీపంలోని శివరాం గ్రామానికి వచ్చేసింది. భార్య ఉంటున్న చిరునామా తెలుసుకున్న గౌస్ ఆ గ్రామానికి వచ్చి తన ఏడేళ్ల పాపను తనకు అప్పగించాలని కుటుంబ సభ్యులను బెదిరించాడు. వారు పట్టించుకోకపోవడంతో గరివిడి పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఒంటిపై పెట్రోల్ పోసుకుంటూ హల్‌చల్ చేసి, కొద్ది సేపటి తర్వాత వెళ్లిపోయాడు.

డ్రైనేజీలోకి ఎస్కార్ట్ వాహనం



డ్రైనేజీలోకి దూసుకు వెళ్లిన ఎస్కార్ట్ వాహనం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): కోటిపల్లి బస్టాండ్ వైపు నుంచి రైల్వేస్టేషన్ వైపు వెళుతున్న తెలంగాణ రాష్ట్రానికి చెందిన పోలీసు ఎస్కార్ట్ వెహికల్ ఆల్కాట్‌తోట గూడ్స్‌షెడ్ వద్ద డ్రైనేజీలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదు. బ్రేక్ ఫెయిల్ కావడంతో ఈ ప్రమాదం చోటు చేసుకున్నట్లు తెలుస్తోంది. ప్రొక్‌లెన్ సహాయంతో వెహికల్‌ను బయటకు తీశారు.

కౌలు రైతు ఆత్మహత్య

- కౌలు సాగులో నష్టాలతో గడ్డిమందు తాగిన వైనం
- చికిత్స పొందుతూ కాకినాడ జీజీహెచ్‌లో మృతి

ద్వారకాతిరుమల: కౌలు వ్యవసాయంలో నష్టాలు రావడంతో మనస్తాపానికి గురైన ఓ రైతు గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి, చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మండలం ఐఎస్ రాఘవాపురం పంచాయతీ తూర్ల లక్ష్మీపురం గ్రామంలో ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే. జంగారెడ్డిగూడెం మండలం మాల నిమ్మలగూడేనికి చెందిన దాసరి రమేష్ (30), రాజేశ్వరి దంపతులకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. రమేష్ తూర్ల లక్ష్మీపురంలో కౌలుకు వ్యవసాయం చేస్తుండగా.. పంటల సాగులో నష్టాలు రావడంతో కొంతకాలంగా మనస్తాపంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో ఈ నెల నాలుగో తేదీ సాయంత్రం 4 గంటలకు కౌలుకు తీసుకున్న కోకో తోటలో ఆవుకు పాలు తీస్తానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. గంట తర్వాత ఇంటికి తిరిగి వచ్చిన అతడు వాంతులు చేసుకుంటుండడంతో భార్య రాజేశ్వరి ప్రశ్నించగా గడ్డి మందు తాగినట్లు తెలిపాడు. దీంతో కుటుంబ సభ్యుల సహాయంతో రాజేశ్వరి వెంటనే రమేష్‌ను జంగారెడ్డిగూడెంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించింది. మెరుగైన వైద్యం కోసం తొలుత గుంటూరు ప్రభుత్వాస్పత్రికి, అనంతరం కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో శుక్రవారం ఉదయం 10 గంటలకు రమేష్ మృతి చెందాడు. భార్య రాజేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై టి.సుధీర్ తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

SITE FOR SALE

■ రాజమండ్రి, మల్లయ్యపేట, 40 Feet మెయిన్ రోడ్డులో వ్యాపారం / బిజినెస్‌కు అనుకూలంగా ఉత్తరముఖం 177 చదరపు గజాలు స్థలము అమ్మబడును. సెల్ : 94404 02307 [R-1863]

LAND FOR SALE

■ **Land for Sale** Size 223 Sq.Y near CTRI, behind Govt Hospital, Rajahmundry. Clear Title. Contact Owner : ✆ : 94917 13875 [R-1307726]

Wanted

■ జయంతి లాల్ అండ్ సన్స్ కిరాణా & మసాలా షాప్ నెం.A38, SVG మార్కెట్, RJY నందు పనిచేయుటకు యువకులు కావలెను. సంప్ర: ✆ : 98495 44360 [R-1307725]

■ యూనిటీ హోంకేర్: విజయవాడ/ హైదరాబాద్‌లో వృద్ధులను, పేషెంట్స్‌ను 24/7 చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఏజ్: 20-50. ఫ్రీ వసతి,భోజనం.జీ: 18K-20K.Ph: 8121541212 [H-783559]

■ హాస్పిటల్స్ నందు కాంట్రాక్టు & ఔట్ సోర్సింగ్ పద్ధతిలో ఫిమేల్ స్టాఫ్‌నర్స్ అ.కా.ను. అసిస్టెంట్స్, ANM, GNM, MLT, DMLT, Lab జీ:25K to 29K. వాట్సాప్ 7989082411 [H-805474]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు

సాక్షి క్లాసిఫైడ్స్

నాలుగు లైన్లకు రూ. : 400/-

అదనపు లైనుకు రూ. : 90/-

GST 5% Extra

సర్వే నెం.264, ADB రోడ్, రాజానగరం.

ఫోన్స్: 0883-2483010

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.